సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 5 । జనవరి । 2024



వేతన వెతలు

ఇల్లెందు ఆదర్శ మున్సిపాలిటీగా మారడంలో క్రియాశీలక పాత్ర పోషించిన పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు అందడం లేదు. 8లో



భారీగా గంజాయి పట్టివేత

లారీలో తరలిస్తున్న 650 కేజీల గంజాయిని లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల క్రాస్‌రోడ్ వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
30° / 18°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున, రాత్రి వేళల్లో చలి ప్రభావం అధికంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉంటాయి.

న్యూస్‌రీల్

విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్య తప్పదు

డీఎంహెచ్‌ఓ శిరీష

కరకగూడెం: విధి నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించినా, హాజరు నమోదు, రిజిస్టర్ల నిర్వహణలో అక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష హెచ్చరించారు. గురువారం ఆమె పినపాక, కరకగూడెం పీహెచ్‌సీలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని సూచించారు. తనిఖీ సమయంలో పలువురు సిబ్బంది ఆస్పత్రిలో లేనందున వారిని గైర్హాజరుగా రిజిస్టర్‌లో నమోదు చేసి షోకాజ్ నోటీసులు ఇస్తామని తెలిపారు.

కలెక్టర్‌కు ఐటీడీఏ అధికారుల శుభాకాంక్షలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలకు గురువారం కలెక్టరేట్‌లో ఐటీడీఏ అధికారులు పూలమొక్క అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఐటీడీఏ ఏపీఓ డేవిడ్ రాజ్, గిరిజన సంక్షేమశాఖ ఈఈ తానాజీ, ఎస్‌ఓ సురేష్‌కుమార్, ఆర్‌ఓఎఫ్‌ఆర్ డీటీ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నీతి ఆయోగ్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

చుంచుపల్లి: గుండాల మండల పరిధిలో నీతి ఆయోగ్‌లో తాత్కాలిక ప్రాతిపదికన పనిచేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి పీజీ ఉత్తీర్ణులైన వారు అర్హులని, నెలకు వేతనం రూ.55 వేలు ఉంటుందని పేర్కొన్నారు. ఎంపికైన వారు ఏడాది పాటు విధులు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. అర్హత, ఆసక్తి గలవారు ఐడీఓసీలోని తమ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని, వివరాలకు 9989840266 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అటకెక్కిన ఆటోనగర్

జిల్లా వ్యాప్తంగా పరిశ్రమల విస్తరణ

- పెద్ద సంఖ్యలో భారీ వాహనాలు
- రిపేర్‌కు వస్తే విజయవాడే దిక్కు
- అమలు కాని 'ఆటోనగర్' ప్రతిపాదనలు


సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రకృతి సంపద, సహజ వనరులకు నిలయం భద్రాద్రి జిల్లా. ఇక్కడున్న ప్రకృతి వనరుల ఆధారంగా జిల్లాలో భారీ పరిశ్రమలు వచ్చాయి. వీటికి అనుబంధంగా భారీ సంఖ్యలో వాహనాలు కూడా ఉన్నాయి. అయితే ఈ వాహనాలకు సాధారణ, వార్షిక మరమ్మతుల కోసం పొరుగు రాష్ట్రమైన ఏపీలోని విజయవాడకు వెళ్లాల్సి వస్తోంది. జిల్లాలో వాహనాల రిపేర్ల కోసం పూర్తి స్థాయిలో ఆటోనగర్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

జిల్లాలో భారీ పరిశ్రమలు..

జిల్లాలోని ఇల్లెందు, మణుగూరు, కొత్తగూడెంలో సింగరేణి గనులు విస్తరించి ఉన్నాయి. పాల్వంచ, మణుగూరులో థర్మల్ విద్యుత్ కేంద్రాలు ఉండగా, సారపాకలో పేపర్ పరిశ్రమ (ఐటీసీ), అశ్వారావుపేటలో ఆయిల్ పరిశ్రమలూ ఉన్నాయి. బూర్గంపాడు మండలం లక్ష్మీపురంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు స్థాపించారు. ఈ పరిశ్రమలకు ముడి సరుకు తీసుకురావడంతో పాటు ఇక్కడ జరిగే ఉత్పత్తిని ఇతర ప్రాంతాలకు రవాణా చేసేందుకు నిత్యం వేలాదిగా లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ పరిశ్రమలను ఆధారంగా చేసుకుని జిల్లాలో అధిక సంఖ్యలో భారీ వాహనాలను కొనుగోలు చేశారు. ఇవి కాకుండా వ్యక్తిగత, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్, వ్యవసాయ రంగంలో కలిపి జిల్లాలో 1,89,690 వాహనాలు ఉన్నాయి. ఇందులో ద్విచక్ర వాహనాలను మినహాయిస్తే ఆటోల నుంచి క్రేన్ల వరకు సుమారు 60 వేల వరకు వాహనాలు ఉన్నాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

పాల్వంచ కేంద్రంగా..

పారిశ్రామిక ప్రాంతాలైన ఇల్లెందు, మణుగూరు, సారపాక, పాల్వంచ, కొత్తగూడెంలో ఓ స్థాయి వరకు ఇంజనీరింగ్ అండ్ మెకానికల్ వర్క్స్ సేవలు లభిస్తున్నాయి. వీటన్నింటిలో పాల్వంచలో మెరుగైన సేవలు లభిస్తాయనే నమ్మకం వాహనదారుల్లో ఉంది. గతంలో పాల్వంచ – కొత్తగూడెం మధ్య చాతకొండ ఏరియాలో ఆటోనగర్ ఏర్పాటు కోసం అక్కడున్న ప్రభుత్వ స్థలాలను గుర్తించారు. కానీ తర్వాత కాలంలో ఈ ప్రతిపాదనలు అటకెక్కాయి.



జిల్లాలోని వాహనాల వివరాలిలా..

ఆటోలు	లారీలు	కార్లు	ట్యాక్సీలు	టూ వీలర్లు
18,103	8,542	16,297	2,187	1,14,360

ట్రాక్టర్లు	స్కూల్ బస్సులు	స్టేజి క్యారియర్లు	భారీ వాహనాలు
2,360	328	280	843

ఉపాధికి అవకాశం..

పొరుగున ఉన్న ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు వెళ్లే భారీ వాహనాలు జిల్లా మీదుగానే ప్రయాణిస్తున్నాయి. జిల్లా సరిహద్దులు దాటితే ఆయా రాష్ట్రాల్లో కనీసం రెండు వందల కిలోమీటర్ల వరకు ఎక్కడా సరైన మెకానిక్ సర్వీసులు లభించే పరిస్థితి లేదు. భద్రాద్రి జిల్లాను మినహాయిస్తే దగ్గరలో విజయవాడ, వరంగల్‌లో ఆటోనగర్‌లు ఉన్నాయి. దీంతో పొరుగు రాష్ట్రాలకు చెందిన వాహనదారులు జిల్లాలోని మెకానిక్ సెంటర్లపై ఆధారపడుతున్నారు. పైగా జిల్లా మీదుగా మూడు జాతీయ రహదారులు వెళ్తున్నాయి. ప్రస్తుతం ఒక రహదారి నిర్మాణం పూర్తి కాగా, మరో రెండు జాతీయ రహదారుల నిర్మాణం త్వరలో చేపట్టనున్నారు. స్థానికంగా ఉన్న డిమాండ్, భవిష్యత్ అవసరాలను పరిగణనలోకి తీసుకుని జిల్లాలో ఆటోనగర్ ఏర్పాటు చేస్తే వాహన యజమానులకు సౌకర్యంగా ఉంటుంది. అంతేకాక అసంఘటిత రంగంలో వందల మందికి ఉపాధి లభించే అవకాశం ఉంది.

సమస్య వస్తే విజయవాడకే..

ఆటోల వరకు మినహాయిస్తే కార్లు మొదలు లారీలు, ఇతర భారీ వాహనాలకు సంబంధించి పెద్ద రిపేర్లు వచ్చినా, ఆల్ట్రేషన్ పనులు, వార్షిక మరమ్మతుల కోసం జిల్లాలో అనువైన సదుపాయాలు, మెకానిక్‌లు లేరు. దీంతో వాహనదారులు మరమ్మతుల కోసం విజయవాడలోని ఆటోనగర్‌పై ఆధారపడాల్సి వస్తోంది. నిత్యం పదుల సంఖ్యలో జిల్లాకు చెందిన వాహనాలు విజయవాడ ఆటోనగర్‌కు వెళ్తున్నాయి. స్థానికంగా ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని గతంలో జిల్లాలో ఆటోనగర్ ఏర్పాటు కోసం ప్రయత్నాలు చేసినా అవి కార్యరూపం దాల్చలేదు.

గోకుల రామంలో విలాసోత్సవం



గోకుల రామంలో విలాసోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, హాజరైన భక్తులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో అధ్యయనోత్సవాల్లో భాగంగా స్వామివారికి విలాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం ఏపీలోని పురుషోత్తపట్నంలో గల వనవిహార మండపంలో ఈ సేవ నిర్వహించారు. తొలుత రామయ్యను వేంకటేశ్వరస్వామిగా అలంకరించారు. అనంతరం మంగళవాయిద్యాలు, భక్తుల శ్రీరామనామస్మరణలు, కోలాటాల నడుమ పల్లకీ సేవగా గోకుల రామంలో కొలువుదీర్చారు. అర్చకులు ప్రత్యేక పూజలు జరిపిన తర్వాత స్వామివారికి నివేదన, హారతి సమర్పించి భక్తులకు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో గోకుల రామం నిర్వాహకులు హరిశ్చంద్రనాయక్ కుటుంబ సభ్యులు, పరిమి సోమశేఖర్ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రామయ్య నిత్య కల్యాణం..

శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ ధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

అట్టహాసంగా క్రీడోత్సవాలు షురూ..



పాల్వంచ మండలం కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్‌లో రాష్ట్రస్థాయి గిరిజన ఆశ్రమ పాఠశాలల క్రీడా పోటీలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని నాలుగు ఐటీడీఏల పరిధిలో గల పాఠశాలల నుంచి 1,650 మంది విద్యార్థులు, 400 మంది పీఈటీలు, పీడీలు, కోచ్‌లు పోటీలకు హాజరయ్యారు. కలెక్టర్ ప్రియాంక ఆల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి, విల్లు ఎక్కుపెట్టి పోటీలను ప్రారంభించారు. భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, అశ్వారావుపేట, వైరా ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, రాందాస్‌నాయక్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. – పాల్వంచ రూరల్

10లో

'తొలిమెట్టు'పై దృష్టి పెట్టండి



మాట్లాడుతున్న నాగరాజశేఖర్

చర్ల: విద్యాశాఖలో అమలవుతున్న తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాలపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎ.నాగరాజశేఖర్ ఆదేశించారు. మండలంలోని దోశిళ్లపల్లి, శివలింగాపురం, లక్ష్మీకాలనీ, ఆనందకాలనీ, చర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో అమలవుతున్న కార్యక్రమాలను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం చర్లలోని విద్యావనరుల కేంద్రంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు, రిసోర్స్ పర్సన్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాలపై ఎలాంటి అలసత్వం వహించొద్దని సూచించారు. కార్యక్రమాల విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో మండల నోడల్ అధికారి పీ.వీ. రమణ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు విజయబాబు, బీసమ్మ, మంజుల, శ్రీనివాసరావు, సీఎస్‌ఎఫ్ సంస్థ ప్రతినిధులు మురళి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకోవాలి

అదనపు కలెక్టర్ మధుసూదన్‌రాజు

చుంచుపల్లి: అర్హులందరికీ ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహిస్తూ దరఖాస్తులు స్వీకరిస్తోందని, పేదలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి.మధుసూదన్ రాజు అన్నారు. చుంచుపల్లి మండలం విద్యానగర్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రజా పాలన గ్రామసభలో ఆయన మాట్లాడారు. గ్రామసభల్లో దరఖాస్తులు అందించలేని వారు ఉంటే ఆ తర్వాత కూడా అధికారులకు ఇవ్వొచ్చని సూచించారు. ప్రజలు అందజేస్తున్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. గ్రామసభలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, నీడ వంటి వసతులు కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ శిరీష, మండల ప్రత్యేకాధికారి సులోచనా రాణి, ఎంపీఓ సత్యనారాయణ, తహసీల్దార్ కృష్ణ, సర్పంచ్ బానోతు గోవింద్, ఎస్సై ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.



దరఖాస్తుల నమోదు రికార్డును పరిశీలిస్తున్న మధుసూదన్‌రాజు

దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి

పాల్వంచరూరల్ : గ్రామసభల్లో ప్రజలు ఇచ్చే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని అదనపు కలెక్టర్ పి.రాంబాబు అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని కేశవాపురంలో గురువారం జరిగిన గ్రామసభను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దరఖాస్తుల వివరాలను తహసీల్దార్ నాగరాజును అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఇచ్చిన దరఖాస్తులన్నీ ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. దరఖాస్తుల్లో ఏమైనా తప్పులుంటే సరిచేసేలా ప్రజలకు సహకరించాలన్నారు.

మలేరియా నిర్మూలనకు కృషి చేయాలి

డీఎంఓ స్పందన

భద్రాచలంటౌన్: జిల్లాలోని మారుమూల గ్రామాల ప్రజలకు మలేరియా వ్యాధిపై అవగాహన కల్పించి నిర్మూలనకు కృషి చేయాలని జిల్లా మలేరియా అధికారి స్పందన అన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో హెల్త్ అసిస్టెంట్లు, ల్యాబ్ టెక్నీషియన్లకు గురువారం 'ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లాట్‌ఫాం'పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా స్పందన మాట్లాడుతూ.. జిల్లాలో మలేరియా నిర్మూలన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ఐహెచ్ఐపీ పోర్టల్‌లో ఆన్‌లైన్ చేయాలని చెప్పారు. మలేరియాతో ఒక్క మరణం కూడా సంభవించకుండా సాధ్యమైనంత వరకు సేవలను విస్తృతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజలకు అందించే ప్రత్యేక వైద్య సేవలపై దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో జిల్లా సహాయ మలేరియా అధికారి గొంది వెంకటేశ్వర్లు, ఎస్‌యూఓలు వెంకటేశ్వర్లు, లింగ్యా నాయక్, కుమార్, ఐడీఎస్పీ హరికిషన్, రంజిత్, లాలూలాల్, గోపి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంఓ స్పందన

లోక్‌సభ కాంగిరేసులో...



- ఖమ్మం స్థానంపై పలువురు నేతల నజర్
- టికెట్ దక్కించుకునేందుకు పావులు
- బీ ఫాం వస్తే విజయం సులువేనని ధీమా
- జాబితాలో రేణుకాచౌదరి, పొంగులేటి ప్రసాద్‌రెడ్డి, మల్లు నందిని సహా పలువురు
- గెలిచే స్థానాలపై ప్రత్యేక దృష్టి సారించిన అధిష్టానం

అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి అధికారం చేజిక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికలపై దృష్టి సారించింది. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా అత్యధిక అసెంబ్లీ స్థానాలు సాధించిన చోట్ల గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతోంది. బలమైన అభ్యర్థులను బరిలోకి దించి మెజార్టీ స్థానాలు దక్కించుకునేలా ముందస్తు కసరత్తు ప్రారంభించగా, బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, పార్టీ నేతలు పార్లమెంట్ ఎన్నికలపై సమీక్షించారు. కాగా, అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని అన్ని స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేసిన నేపథ్యాన ఇక్కడ టికెట్ 'చే'జిక్కించుకుంటే విజయం నల్లేరుపై నడకేననే ధీమా ఆశావహుల్లో వ్యక్తమవుతోంది. ఈ మేరకు పలువురు నేతలు టికెట్లు ఆశిస్తూ ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. జాబితాలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు ప్రసాద్‌రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సతీమణి నందిని, మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్, వ్యాపారవేత్త వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ ఉన్నట్లు తెలుస్తోంది.

–సాక్షిప్రతినిధి, ఖమ్మం

తనదైన ముద్రతో ప్రసాద్‌రెడ్డి..



పొంగులేటి ప్రసాద్‌రెడ్డి

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాజకీయ అరంగేట్రం చేసినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ, బీఆర్‌ఎస్, ఇప్పుడు కాంగ్రెస్‌లో ఏ భారీ కార్యక్రమం చేపట్టినా ఆయన సోదరుడు ప్రసాద్‌రెడ్డి వెనక ఉండి ఏర్పాట్లు చూశారు. అంతేకాక పార్టీ నేతలు, కేడర్‌కు అందుబాటులో ఉంటూ 2014 ఎన్నికల్లో ఖమ్మం ఎంపీగా పొంగులేటి విజయంలో కీలక పాత్ర పోషించారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లోనూ పాలేరు నియోజకవర్గంలో విస్తృత ప్రచారం చేశారు. ప్రస్తుతం శ్రీనివాసరెడ్డి ఆశీస్సులతో ప్రసాద్‌రెడ్డి ఖమ్మం పార్లమెంట్ బరిలో నిలబడనున్నారని వారి అనుచర వర్గంలో ప్రచారం ఊపందుకుంది. కాంగ్రెస్ పార్టీ, పొంగులేటికి ఉన్న చరిష్మాకు తోడు మంత్రులు భట్టి, తుమ్మల సహకారం తోడైతే ప్రసాద్‌రెడ్డి విజయం సులువేననే చర్చ జరుగుతోంది. పార్లమెంట్ పరిధిలోని పార్టీ నేతలతో ఉన్న పరిచయాలు ఆయనకు కలిసొస్తాయనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మళ్లీ టికెట్ తనదేనని..



రేణుకాచౌదరి

కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి ఖమ్మం పార్లమెంట్ టికెట్ తనదేనన్న ధీమాతో ఉన్నారు. 1999లో ఆమె తొలిసారి ఖమ్మం పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప మెజార్టీతో టీడీపీ అభ్యర్థిపై విజయం సాధించారు. ఆ తర్వాత 2004లో ఇదే స్థానం నుంచి టీడీపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావుపై గెలుపొందారు. 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసినా టీడీపీ అభ్యర్థి నామా చేతిలో ఓడిపోయారు. 2014లో కాంగ్రెస్, సీపీఐ పొత్తు కారణంగా పోటీకి అవకాశం దక్కలేదు. అప్పుడు వైఎస్సార్‌సీపీ తరఫున పొంగులేటి శ్రీనివాసరెడ్డి గెలిచారు. ఇక 2019లో మళ్లీ ఆమె కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసినా బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు చేతిలో ఓటమి తప్పలేదు. 1999 నుంచి జరిగిన ఐదు పార్లమెంట్ ఎన్నికల్లో రేణుకాచౌదరి నాలుగు సార్లు కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తే రెండు సార్లు గెలవగా, మరో రెండుసార్లు ఓడిపోయారు. ఇప్పుడు కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి రావడం, ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని అన్ని స్థానాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలే గెలిచిన నేపథ్యాన ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తే భారీ మెజార్టీతో విజయం దక్కుతుందనే ఆలోచనలో ఆమె టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు అనుచరులు చర్చించుకుంటున్నారు.

అధిష్టానం ఆదేశిస్తే సై..



మల్లు నందిని

డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సతీమణి నందిని సైతం ఖమ్మం పార్లమెంట్ టికెట్ ఆశిస్తున్నారు. ఇటీవల వివిధ చోట్ల జరిగిన సభల్లో అధిష్టానం ఆదేశిస్తే బరిలో ఉంటానని ప్రకటించారు. దీంతో తాను ఖమ్మం ఎంపీ టికెట్ ఆశిస్తున్నట్లుగా సంకేతాలిచ్చారు. ఉమ్మడి జిల్లాలో భట్టికి ఉన్న అనుచర గణం, ఖమ్మం పార్లమెంట్ పరిధిలో మధిర నుంచి ఆయన విజయం సాధించడం వంటి అంశాలు నందినికి కలిసొస్తాయని అనుచర వర్గం చెబుతోంది. భట్టి పోటీ చేసిన ప్రతీసారి ఆమె నియోజకవర్గమంతా ప్రచారం చేస్తున్నారు. ఖమ్మం పార్లమెంట్ పరిధిలో ఉన్న పరిచయాలు, భట్టి నాయకత్వం తనకు కలిసొస్తాయనే భావనతో పోటీకి సై అంటూ నందిని పలు కార్యక్రమాలకు హాజరవుతున్నట్లు సమాచారం.

కుటుంబ నేపథ్యంతో..



వంకాయలపాటి రాజేంద్రప్రసాద్

కుటుంబ నేపథ్యానికి తోడు ప్రముఖ వ్యాపారిగా పేరున్న వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ సైతం ఖమ్మం పార్లమెంట్ టికెట్ ఆశిస్తున్నారు. గతంలో ఆయన తండ్రి, సోదరులకు కాంగ్రెస్‌తో సంబంధాలు ఉండడం, పలు జిల్లాల పార్టీ ముఖ్య నేతలతో ఉన్న పరిచయాలతో ఆయన టికెట్ ప్రయత్నాల్లో ఉన్నట్లు చర్చ జరుగుతోంది. జిల్లా మంత్రులకు నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన పేరిట ఖమ్మంలో భారీగా ఫ్లెక్సీలు వెలిశాయి. గత పార్లమెంట్ ఎన్నికల్లోనూ రాజేంద్రప్రసాద్ కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం చివరి వరకు ప్రయత్నించారని ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. గతంలో పోటీ చేసిన వారికి కాదని, అదే సామాజిక వర్గానికి మళ్లీ అధిష్టానం టికెట్ ఇవ్వాలనుకుంటే ఆయనకు ఖమ్మం టికెట్ ఖాయమని వ్యాపారుల్లో చర్చ మొదలైంది.

రాజకీయ అరంగేట్రంలో యుగంధర్



తుమ్మల యుగంధర్

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్ ఖమ్మం ఎంపీగా పోటీ చేయడం ద్వారా రాజకీయ అరంగేట్రం ఆలోచనలో ఉన్నట్లు తుమ్మల అనుచరుల్లో ప్రచారం జరుగుతోంది. గతంలో సత్తుపల్లి, ఖమ్మం, పాలేరు స్థానాల్లో తుమ్మల పోటీ చేసినప్పుడల్లా యుగంధర్ పార్టీ నేతలు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లోనూ నేతలు, కేడర్‌ను సమన్వయం చేసే బాధ్యతలన్నీ ఆయనే దగ్గరుండి చూశారు. తుమ్మల రాజకీయ చాణక్యత, అటు యుగంధర్ సమన్వయంతో ఖమ్మం నియోజకవర్గంలో భారీ మెజార్టీ వచ్చిందన్న చర్చ వారి వర్గంలో జరుగుతోంది. దీంతో ఆయన ఖమ్మం పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేస్తారంటూ తుమ్మల అనుచరుల ద్వారా సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరుగుతోంది. ఇదే నిజమైతే భవిష్యత్ రాజకీయాల్లో తండ్రి రాజకీయ వారసత్వాన్ని ఆయన అందిపుచ్చుకుంటారని చెబుతున్నారు.

క్లుప్తంగా

కేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇంట్లో చోరీ

పాల్వంచ: కేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ పనిచేస్తున్న ఓ వ్యక్తి ఇంట్లో కొందరు గుర్తుతెలియని దుండగులు ప్రవేశించి విలువైన బంగారు, వెండి వంటి ఆభరణాలను దోచుకెళ్లారు. పట్టణంలో ఇటీవల ఈ ఘటన జరుగగా గురువారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కొత్తపల్లి పున్నంచందర్ పట్టణంలోని నవభారత్ కేఎస్ఎం మైనింగ్ కళాశాల పరిధిలో గల క్వార్టర్‌లో నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యాన పున్నంచందర్ గత నెల 21వ తేదీన యూనివర్సిటీకి వెళ్లగా.. అతడి భార్య అదే నెల 23వ తేదీన పున్నంచందర్ వద్దకు పిల్లలతో కలిసి క్వార్టర్‌కు తాళం వేసి వెళ్లింది. తిరిగి ఈనెల 3వ తేదీన ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా.. దొంగలు ఇంట్లోని ఇనుప అల్మారా పగుల గొట్టి 5 గ్రాముల బంగారు ఉంగరం, 35 గ్రాముల బంగారు కంకణాలు, 30 గ్రాముల బంగారు హారం, 10 గ్రాముల బంగారు గొలుసు, 10 గ్రాముల పిల్లల గాజులు, 35 గ్రాముల వసంత హారం, వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించింది. చోరీ అయిన సొత్తు విలువ రూ.2.80లక్షలు ఉంటుందని బాధితులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ బి.రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం..

పాల్వంచరూరల్: పెద్దమ్మ గుడి వద్ద పార్కింగ్ చేసిన ఓ ద్విచక్ర వాహనం గురువారం చోరీకి గురైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన మిషన్ భగీరథలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న కె.శ్రీకాంతరెడ్డి తన టీఎస్ 28ఎన్ 9643 నంబర్ గల ద్విచక్ర వాహనాన్ని గత నెల 24వ తేదీన పెద్దమ్మ గుడి ఎదుట రోడ్డు పక్కన పార్క్ చేసి వెళ్లాడు. తిరిగి వచ్చి చూస్తే అక్కడ తన బండి కన్పించకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.శ్రీనివాస్ తెలిపారు.

టెలికాం జనరేటర్‌లో రూ.లక్ష విలువైన సామగ్రి..

రఘునాథపాలెం: మండలంలోని కోయచలకలో బీఎస్ఎన్ఎల్ టవర్‌కు సంబంధించి జనరేటర్‌లోని సుమారు రూ.లక్ష విలువైన సామగ్రి చోరీ అయింది. ఈ విషయమై బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి పొన్నెకంటి వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుతో గురువారం రఘునాథపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. 2010లో ఈ జనరేటర్‌ను ఏర్పాటుచేయగా, ఈ ఏడాది సెప్టెంబర్ 2వ తేదీ సాఫీగానే నడిచింది. అదే నెల 19న సిబ్బంది వెళ్లి చూడగా జనరేటర్‌లోని ఇంజన్, ఆటోమెటిక్ సామగ్రీ చోరీ అయినట్లు గుర్తించారు. దీంతో విషయన్ని ఉన్నతాధికారులకు తెలియజేసి వారి సూచనలతో గురువారం ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది.

ఐదుగురిపై కేసు నమోదు

పాల్వంచరూరల్: చిన్నారుల గొడవలో ఘర్షణ పడ్డ ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని పూసలతండా గ్రామానికి చెందిన బానోత్ నాగేశ్వరరావు, అతడి భార్య నాగమణిలు గురువారం వీధిలో కాలినడకన వస్తున్నారు. ఈక్రమంలో అదే గ్రామానికి బి.గాంధీ, స్వరూప, చంద, బోడిలు తమతో ఘర్షణకు దిగి దాడి చేశారని నాగేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్సై నలుగురిపై కేసు నమోదు చేయగా.. ఇదే ఘర్షణపై గాంధీ కూడా ఫిర్యాదు చేయడంతో నాగేశ్వరరావుపై కేసు నమోదు చేశారు.

భూ వివాద ఘటనలో ముగ్గురిపై..

అశ్వారావుపేటరూరల్: భూ వివాద ఘటనలో ముగ్గురిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్ఐ పి.శ్రీకాంత్ కథనం ప్రకారం. మండలంలోని వేదాంతపురం గ్రామ సమీపంలో పాలూరి సత్యనారాయణ అనే రైతుకు సుమారు 50 ఎకరాల మామిడి తోట ఉంది. ఈ తోటలో నూకవరపు రమణ, సూర్యకుమారి, శ్రీకాంత్ కలిసి కొన్నేళ్లుగా మకాం ఉంటూ..కూలీ పనులు చేస్తున్నారు. ఈ క్రమంలోనే కొద్ది నెలల క్రితం ఆ ముగ్గురిని కూలీ పని లేదని, ఖాళీ చేయాలని సత్యనారాయణ గేటుకు తాళం వేయడంతో వారంతా కలిసి గేటుకు వేసిన తాళం, ఫెన్సింగ్‌ను ధ్వంసం చేశారు. దీనిపై సత్యనారాయణ చేసిన లిఖిత పూర్వక ఫిర్యాదుతో ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కూసుమంచి: మండలంలోని రావిచెట్టుతండాకు చెందిన తేజావత్ కృష్ణ(48) గతనెల 29న ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. ఈమేరకు ఆయన భార్య తులసీబాయ్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. కూసుమంచికి చెందిన తన స్నేహితుడు పిట్టల వీరబాబుతో కలిసి కృష్ణ ద్విచక్ర వాహనంపై ఖమ్మం వెళ్లి వస్తుండగా గోపాలరావుపేట సమీపాన డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ కృష్ణ మృతి చెందాడు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.12,448

వేతన వెతలు..!

జీతాలు అందక మున్సిపల్ కార్మికుల కష్టాలు

- 18 నెలలుగా జమ కాని పీఎఫ్
- మూడు నెలలుగా అందని వేతనాలు
- 13 నెలలుగా విడుదల కాని ఏరియర్స్
- కార్మికుల కుటుంబాల్లో కానరాని సంక్రాంతి సంబరాలు
- ఇల్లెందు, మణుగూరు మున్సిపాలిటీలలో కార్మికుల ఆవేదన



శానిటేషన్ పనులు చేస్తున్న కార్మికులు

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపాలిటీకి ఆదర్శ మున్సిపాలిటీగా మంచిపేరు తెచ్చి పెట్టడంతో కార్మికుల పాత్ర ఘనణీయమైంది. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న కార్మికుల బతుకు మాత్రం ఛిద్రమవుతోంది. ఏళ్లు గడుస్తున్నా వారి ప్రావిడెంట్ ఫండ్(పీఎఫ్) అందడం లేదు. ప్రతి నెలా కార్మికుల వేతనాల్లో పీఎఫ్ కింద కోత విధిస్తున్నారే కానీ పీఎఫ్ కార్యాలయంలో మాత్రం జమ కావడం లేదు. ఎవరైనా కార్మికుడు పదవీ విరమణ చేసినా, మరణించినా వారి కుటుంబాలు ఈ కార్యాలయం చుట్టూ తిరగాల్సిందే. ఇల్లెందు మున్సిపాలిటీలో శానిటేషన్, వాటర్, భగీరథ పనులు, హరితహారంలో చెట్ల ట్రిమ్మింగ్, ఎస్ఎంఆర్ వర్కర్లు, డ్రైవర్లు, హెల్పర్లు, రిక్షా వర్కర్లు ఇలా మొత్తం 150 మంది వరకు కార్మికులు పనిచేస్తున్నారు. అధికారులు ప్రతి నెలా ఒక్కో కార్మికుడి ఖాతా నుంచి రూ. 2 వేల వరకు పీఎఫ్ కింద కట్ చేసుకుంటున్నారు తప్పా నిధులు లెవ్వని 18 నెలలుగా జమ చేయడం లేదు. ఈ సమస్య ఇల్లెందులోనే కాదు మణుగూరు మున్సిపాలిటీలోనూ ఉంది. అక్కడ కూడా 53 మంది కాంట్రాక్ట్ కార్మికులు పని చేస్తున్నా.. 22 నెలలుగా ఏరియర్స్ బకాయిలు ఉన్నాయి. ఇక మేడే కానుక కింద ప్రకటించిన ప్రతి నెలా రూ.వెయ్యి కూడా విడుదల కావడంలేదు.

నిధులు లేకనే..

ఇల్లెందు మున్సిపాలిటీలో మూడు నెలలుగా కార్మికులకు వేతనాలు విడుదల కావడం లేదు. నిధులు లేమి కారణంగా వేతనాలు ఇవ్వలేకపోతున్నామని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. మూడు నెలల వేతనాలు ఇప్పించమని మున్సిపల్ కార్మికులు అటు అధికారులను, ఎమ్మెల్యే కోరం కనకయ్యను, కలెక్టర్ ప్రియాంక ఆలను కలిసి వినతులు సమర్పించారు. ఒక్కో కార్మికుడికి సుమారు. రూ.15,600 వేతనం చెల్లించాల్సి ఉండగా.. ఇందులో పీఎఫ్ రూ. 2 వేలు కటింగ్‌లు పోనూ కనీసం రూ.13 వేల వరకైనా వేతనం చెల్లించాల్సి ఉంది. ఇలా మూడు నెలల వేతనం కోసం కార్మికులు అర్రులు చాస్తున్నారు.

పండుగకు పస్తులేనా?

కొత్త సంవత్సరానికి ముందే కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అటు కొత్త ప్రభుత్వం, ఇటు నూతన సంవత్సరం, మరోవైపు సంక్రాంతి పండగ కూడా రానే వచ్చింది. వెరసీ పండుగ వాతావరణం మాత్రం కార్మికుల కుటుంబాల్లో కానరావడం లేదు. తెలుగు నేలంతా సంక్రాంతి సంబరా లు జరుపుకుంటున్న వేళ కార్మికులు మాత్రం పస్తులు ఉండాలా? అనే ఆక్రందన వారిలో కనిపిస్తోంది.



మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికుల ఆందోళన(ఫైల్)

అధికారుల చుట్టూ ప్రదక్షిణలు..

గతంలో సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు సమ్మె చేయగా.. ప్రభుత్వం వేతనాలు పెంచుతున్నట్లు ప్రకటించింది. కాగా, గత 13 నెలలుగా కార్మికులకు ఏరియర్స్ అందాల్సి ఉంది. అధికారుల చుట్టూ తిరిగి ఏరియర్స్ చెల్లించమని కోరితే వేతనాలకే దిక్కు లేదు.. ఏరియర్స్ ఎలా సాధ్యమవుతుందని చెబుతున్నట్లు సమాచారం. 2012 జూన్‌లో ప్రకటించిన వేతనం 2022 ఆగస్టులో అమలు చేస్తామని నాటి ప్రభుత్వం ప్రకటించడంతో ఆ దిశగా ఏరియర్స్ అందించాలని అడిగితే ఎక్కచి నుంచి తెచ్చి ఇవ్వాలని జవాబిస్తున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ మేడే కానుకగా కార్మికులకు ప్రతి నెలా రూ.వెయ్యి పెంచుతున్నట్లు ప్రకటించినా.. ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉంది.

సమస్యలు పరిష్కరించండి..



పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న కార్మికుల వేతనాల సమస్యలను పరిష్కరించాలి. లేదంటే త్వరలో నిరవధిక సమ్మెకు దిగుతాం. ఇప్పటికే మున్సిపల్ చైర్మన్, కమిషనర్, ఎమ్మెల్యే, కలెక్టర్‌కు వినతి పత్రాలు సమర్పించాం. కార్మికులకు వేతనాలతో ఇబ్బంది పడకుండా సకాలంలో వేతనాలు ఇప్పించి ఆదుకోవాలి.

– యాకుబ్‌షావలీ, ఇఫ్టూ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఇల్లెందు

ఇబ్బంది పడుతున్నాం..



మూడు నెలలుగా మున్సిపల్, ఎస్ఎంఆర్, కాంట్రాక్ట్, రిక్షా కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. అంతేకాక పిల్లల చదువులు, ఆస్పత్రి ఖర్చులు, కుటుంబ పోషణ భారంగా ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కొత్త సంవత్సరంలో సంక్రాంతి పండుగ జరుపుకునేలా చూడాలి.

–కుమార్, కాంట్రాక్ట్ కార్మికుడు, శానిటేషన్ విభాగం, ఇల్లెందు మున్సిపాలిటీ

బకాయిలు చెల్లించాలి..



పీఆర్‌సీ బకాయిలు 13 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. 2018 నుంచి ఎస్ఎంఆర్, రిక్షా కార్మికుల పీఎఫ్ జమ కావడం లేదు. కాంట్రాక్ట్ కార్మికులకు 17 నెలలుగా పీఎఫ్ జమ చేయలేదు. ఒకనాడు ఇల్లెందు కీర్తిని పతాకస్థాయిలో చాటిన కార్మికులకు మాత్రం ఆకలి బాధలు తీరడం లేదు.

– జి. భూలక్ష్మి, ఎస్ఎంఆర్ వర్కర్, ఇల్లెందు మున్సిపాలిటీ

నిధులు లేకనే జాప్యం..



ప్రతి నెలా మున్సిపాలిటీ సాగాలంటే రూ. 30 లక్షల నిధులు కావాల్సి ఉంటుంది. పట్టణం నుంచి రావాల్సిన పన్నులు సక్రమంగా రాకపోవడంతో వేతనాలు ఇవ్వడంలో జాప్యం జరుగుతోంది. పన్నులు రాకుండా వేతనాలు ఇవ్వడం సాధ్యం కాదు. ఆ దిశగా ప్రయత్నం చేస్తున్నాం. పండుగ వరకు కనీసం ఒక నెల వేతనమైనా అందజేస్తాం.

– అంకుషావలీ, మేనేజర్, మున్సిపాలిటీ, ఇల్లెందు

ఈ నెలలో ఆరు సదరం క్యాంపులు

చుంచుపల్లి: జిల్లాలోని దివ్యాంగుల కోసం జనవరిలో ఆరు సదరం క్యాంపులు నిర్వహించనున్నట్లు డీఆర్డీఏ అధికారులు గురువారం ప్రకటించారు. ఈ నెల 6, 10, 17, 24, 27, 31 తేదీల్లో కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి లో ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనుండగా.. దివ్యాంగులు ముందుగా(శుక్రవా రం నుంచి) మీ–సేవా కేంద్రాల ద్వారా తమ పేరు మీద స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ స్లాట్ బుక్ చేసుకునే వారు ముందస్తుగా సంబంధిత మండలం, మున్సిపాలిటీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల చేత గుర్తింపు పొందిన దివ్యాంగ సర్టిఫికెట్‌తో పాటు ఆధార్ కార్డు, పాస్‌ఫొటో, ఫోన్ నంబర్‌ను మీసేవా సెంటర్‌కు తీసుకెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. కొత్తగా నమోదు చేసుకునే వారితో పాటు తాత్కాలిక సదరం సర్టిఫికెట్ గడువు ముగిసినవారు మాత్రమే రూ.35 రుసుం చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవాలని అధికారులు సూచించారు. కాగా, ఆరు రోజుల పాటు నిర్వహించే దివ్యాంగుల సదరం క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీఓ జి.మధుసూదన్‌రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

యువకుడిపై హత్యాయత్నం

- రెండు చేతులు, తలపై నరికిన నిందితులు
- వివాహేతర సంబంధమే కారణమని ప్రచారం



తీవ్రంగా గాయపడిన మల్లేశ్వరరావు

ఎర్రుపాలెం: ఓ యువకుడిని విచక్షణారహితంగా నరికిన ఘటన ఎర్రుపాలెం మండలంలోని బనిగండ్లపాడులో గురువారం జరిగింది. బనిగండ్లపాడుకు చెందిన పలగాని మల్లేశ్వరరావు(28) గురువారం వ్యవసాయ పనుల్లో భాగంగా చేలో అరక తోలి ఇంటికి బయలుదేరాడు. గ్రామంలోని డంపింగ్ యార్డు సమీపాన గుర్తుతెలియని వ్యక్తులు ఆయనపై దాడికి దిగారు. ఈమేరకు మల్లేశ్వరరావు రెండు చేతులు, తలపై పదునైన ఆయుధంతో బలంగా నరకగా తీవ్ర గాయాలతో పడిపోయాడు. కాసేపటికి గుర్తించిన స్థానికులు బనిగండ్లపాడు ప్రభుత్వాస్పత్రి, మధిరల్లో చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. ఈమేరకు ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ ఎం.సురేష్ తెలిపారు. కాగా, వివాహేతర సంబంధమే ఈ దాడికి కారణమని తెలుస్తోంది.

ఓసారి తమిళనాడుకు రండి...

మంత్రి తుమ్మలను ఆహ్వానించిన రైతు పళని స్వామి



రైతు పళని స్వామిని అభినందిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

అశ్వారావుపేట/సత్తుపల్లి: నూనె ఉత్పత్తులతో సేంద్రియ ఎరువులు తయారుచేసి వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధిస్తున్న తమిళనాడుకు చెందిన రైతు పళని స్వామి గురువారం సత్తుపల్లి మండలం పాకలగూడెంలో రాష్ట్ర వ్యవసాయ, చేనేత, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిశారు. ఆ తర్వాత దమ్మపేట మండలం గండుగులపల్లికి కూడా వెళ్లి తుమ్మల వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు. ఉద్యానవన శాఖ మాజీ కమిషనర్ వెంకట్రాంరెడ్డి, రిటైర్డ్ డైరెక్టర్ విష్ణు భూషణ్‌తో కలిసి ఆయన వచ్చారు. స్వయానా రైతు వ్యవసాయ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారని తెలుసుకుని తుమ్మలను కలిసేందుకు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పళని స్వామి మాట్లాడుతూ తాను సంగారెడ్డిలో 25 ఎకరాల వ్యవసాయ క్షేత్రాన్ని కౌలుకు తీసుకుని మొదట్లో రసాయన ఎరువులతో పంటలు పండిస్తే ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదని చెప్పారు. ఆతర్వాత నూనె గింజలు, కొబ్బరిని విడివిడిగా గానుగ ఆడించి వచ్చిన నూనెతో పాటు, పిప్పితో సేంద్రియ ఎరువులను తయారుచేసి ఉపయోగించగా అధిక దిగుబడులు వచ్చాయని తెలిపారు. అలాగే, తమిళనాడులో కూడా ఉద్యాన పంటలతో పాటు వరి తదితర పంటలు సాగు చేస్తున్నానని చెప్పారు. ఈమేరకు తమిళనాడు రాష్ట్రానికి వచ్చి సేంద్రియ ఎరువుల తయారీ విధానం, పంటల దిగుబడిని పరిశీలించాలని మంత్రి తుమ్మలను స్వామి కోరారు. కాగా, పళని స్వామిని అభినందించిన మంత్రి తొలుత తన తోటలో ప్రయోగాత్మకంగా ఎరువులను ఉపయోగించి వచ్చే ఫలితాల ఆధారంగా రాష్ట్రంలో రైతులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు.

కంప్యూటర్లను సద్వినియోగం చేసుకోవాలి

సీఎంఓ సతీష్‌కుమార్



కంప్యూటర్లను పరిశీలిస్తున్న అధికారులు

ఇల్లెందురూరల్: అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో సమగ్ర సర్వశిక్ష అభియాన్ ద్వారా మండల విద్యావనరుల కేంద్రాలకు మంజూరైన కంప్యూటర్లను సద్వినియోగం చేసుకోవాలని విద్యాశాఖ సీఎంఓ, జిల్లా ప్లానింగ్ అధికారి సతీశ్ కుమార్, జిల్లా ఐఈ కో–ఆర్డినేటర్ సైదులు సూచించారు. ఇల్లెందు మండల విద్యావనరుల కేంద్రానికి మంజూరైన కంపూటర్లను, వాటి పరికరాలను గురువారం వారు తనిఖీ చేశారు. కార్యాలయంలో ప్రస్తుతం ఉన్న కంప్యూటర్లు, వాటి పనితీరు పరిశీలించారు.అనంతరం మండల విద్యావనరుల కేంద్రం అధికారులు, సిబ్బందితో వివిధ రిపోర్టులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దివ్యాంగులైన పిల్లలను యూడైస్ ప్లస్‌లో నమోదు చేయాలని, ప్రతీ రోజు ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో విద్యార్థుల హాజరు నమోదు చేయాలని, డ్రాప్ అవుట్ బాక్స్‌లో ఉన్న విద్యార్థులను గుర్తించి వారు చేరిన పాఠశాలల్లో యూడైస్ ప్లస్‌లో కూడా నమోదయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ విషయాలను అన్ని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. విద్యావనరుల కేంద్రంలో నూతన కంప్యూటర్లను త్వరితగతిన ఇన్‌స్టాల్ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పిల్లి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

డీజే విషయంలో వివాదం..

పాల్వంచరూరల్: ఓ వివాహ వేడుకలో డీజే పాటల విషయంలో ఇరు వర్గాల మధ్య తలెత్తిన వివాదం గొడవకు దారి తీసింది. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని సూరారం గ్రామంలో గురువారం జరిగిన ఓ వివాహ వేడుకలో వధువు, వరుడు బంధువుల మధ్య డీజే విషయంలో వివాదం జరిగింది. దీంతో ఇరువర్గాల వారికి స్థానికులు జోక్యం చేసుకుని సర్దిచెప్పడంతో వాగ్వాదం సర్దుమనిగింది.

కాపాడాల్సిన వారే ఆక్రమణదారులైతే ఎలా?

- హరిప్రియ ఫౌండేషన్ భూమిని నిర్వాసితులకు అప్పగించండి
- అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య



వార్డు సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కనకయ్య. పక్కన మున్సిపల్ చైర్మన్ డీవీ తదితరులు

ఇల్లెందు: కంచే చేనును మేసిన చందంగా ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన వారే ఆక్రమించుకుంటే ప్రజలకు న్యాయం ఎలా జరుగుతుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రశ్నించారు. ఇల్లెందు 13వ వార్డులో నిర్వాసితులకు కేటాయించిన భూమిని కబ్జా చేయడం గర్హనీయమని పేర్కొన్నారు. పట్టణంలోని 13వ వార్డు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో గురువారం జరిగిన ప్రజాపాలన వార్డు సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తే.. నిర్వాసిత కాలనీలో అనేక సమస్యలు ఉన్నాయని అర్థమవుతోందన్నారు. నిర్వాసితుల కాలనీలో ప్లాట్లను గత ఎమ్మెల్యే కబ్జా చేసి హరిప్రియ ఫౌండేషన్ ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ విషయమై ఫిర్యాదు అందిన నేపథ్యాన సింగరేణి అధికారులు, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ విచారణ చేపట్టి భూమి స్వాధీనం చేసుకుని నిర్వాసితులకు అప్పగించాలని ఆదేశించా రు. అలాగే, ఆలయాలను సింగరేణి పర్యవేక్షించేలా అధికా రుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఇక భూములు, ఇళ్లు కోల్పోయిన సింగరేణి నిర్వాసితులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై చర్చిస్తానని చెప్పారు. తొమ్మిదేళ్ల కాలంలో ప్రభుత్వ పథకాలకు దూరమైన ప్రజలకు ఈ ప్రభుత్వం న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆరు గ్యారంటీల పేరిట వచ్చే దళారులను నమ్మొద్దని సూచించారు. మున్సిపల్ కమిషనర్ నవీన్, తహసీల్దార్ రవికుమార్, వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషాతో పాటు సిలివేరు అనిత, కడకంచి పద్మ, వారా రవి, అంకెపాక నవీన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం 14వ వార్డులో కౌన్సిలర్ సందా బిందు అధ్యక్షతన జరిగిన వార్డు సభలో కూడా ఎమ్మెల్యే తదితరులు పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. కాగా, పట్టణంలోని 13 వార్డులో సభకు ముందు అక్కడి కౌన్సిలర్ సిలివేరు అనిత భర్త సత్యనారాయణ, మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వరరావు మధ్య వాగ్వాదం జరిగింది. పశువుల కొట్టం స్థల విషయమై స్థానికులు చైర్మన్‌తో చర్చిస్తుండగా వివాదం తలెత్తగా.. ఓ దశలో ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం చోటు చేసుకుంది.

650 కేజీల గంజాయి స్వాధీనం

లారీ సీజ్, ముగ్గురు అరెస్టు, ఇద్దరు పరారీ



పట్టుబడిన లారీతో డీఎస్పీ రెహమాన్,ఎస్ఐ సంతోశ్

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని రేగళ్ల క్రాస్ రోడ్డు వద్ద 650 కేజీల గంజాయితో వెళ్తున్న ఓ లారీని పోలీసులు పట్టుకొని, ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ ఎస్‌కె.రెహమాన్ వెల్లడించారు. గురువారం లక్ష్మీదేవిపల్లి పోలీసు స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజస్తాన్ రాష్ట్రంలోని బీకనీర్ జిల్లాకు చెందిన ఓంప్రకాశ్, సుందర్‌రామ్, సురేశ్ గత నెల 22 తేదీన మూంగ్‌దాల్ లారీ లోడ్‌తో నాగూర్ నుంచి రాజమండ్రికి వెళ్లారు. 28 తేదీన రాజమండ్రిలో మూంగ్‌దాల్ అన్‌లోడ్ చేసి చింతూరు దగ్గర అటవీ ప్రాంతానికి చెందిన ఓం ప్రకాశ్‌కు లారీ డ్రైవర్ సుందర్‌రామ్ ఫోన్ చేసి గంజాయి వివరాలు మాట్లాడుకుని 31 తేదీన రాజమండ్రి నుంచి చింతూరుకు బయలుదేరారు. గంజాయి రావడానికి సమయం పడుతుందని చెప్పడంతో రెండు రోజులు అక్కడే వేచి ఉండి ఈ నెల 3 తేదీన ఓం ప్రకాశ్‌కు ఫోన్ చేశారు. దీంతో ఓంప్రకాశ్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు అక్కడకు చేరుకుని లారీని అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లారు.ఈక్రమంలో 650 కేజీల గంజాయిని రూ.8 లక్షలకు కొనుగోలు చేసి గంజాయినంతా బస్తాల్లో నింపి లారీలో లోడ్ చేశారు.

ఎస్ఐ ఆధ్వర్యాన తనిఖీలు..

ఈ నెల 3 తేదీన రాత్రి 11 గంటలకు గంజాయితో లోడ్ చేసిన లారీతో రాజస్తాన్‌కు బయలుదేరారు. ఈక్రమంలో మార్గమధ్యలోని లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల క్రాస్‌రోడ్డు వద్ద ఎస్ఐ సంతోశ్ ఆధ్వర్యాన వాహనాలు తనిఖీ చేస్తుండగా.. లారీలో ఉన్న గంజాయిని, లారీని స్వాధీనం చేసుకొని ఓంప్రకాశ్, సుందర్‌రామ్‌లను అరెస్ట్ చేయగా.. మిగిలిన ముగ్గురు పరారీలో ఉన్నారు. అరెస్టయిన వారి నుంచి మూడు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గంజాయి అమ్మినా, తాగిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు. కొత్తగూడెం డివిజన్ పరిధిలో గంజాయి నిల్వ ఉన్నట్లు సమాచారం తెలిస్తే సమాచారం ఇవ్వాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

ఎస్ఐ, సిబ్బందికి రివార్డు..

650 కేజీల గంజాయితో వెళ్తున్న లారీతో పాటు ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసిన ఎస్ఐ సంతోశ్, సిబ్బందికి ఎస్పీ రోహిత్ రాజ్ రివార్డు ప్రకటించిన్నట్లు డీఎస్పీ రెహమాన్ తెలిపారు.

ముంపు ముప్పు నుంచి 'రక్షణ'

కృష్ణానది వెంబడి రిటైనింగ్ వాల్ నిర్మాణం



విజయవాడలో కృష్ణానది తీరాన పూర్తయిన రిటైనింగ్‌వాల్.. చురుగ్గా సాగుతున్న సుందరీకరణ పనులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: విజయవాడ నగర ప్రజలకు వరద ముప్పు నుంచి పూర్తి ఉపశమనం కలగనుంది. ఆర్టీసీ బస్టాండు నుంచి యనమలకుదురు వరకు వేలాది మంది ప్రజలకు వరద కష్టాలు తొలగనున్నాయి. ప్రకాశం బ్యారేజినుంచి 5లక్షలకు పైగా క్యూసెక్కుల నీరు దిగువకు వదిలితే దిగువ లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యేవి. ఇప్పుడు 12 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినా ఏ ఇబ్బంది లేకుండా రక్షణ గోడ నిర్మించారు. ఏపీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు నగరంలోని లోతట్టు ప్రాంతవాసుల ముంపు కష్టాలనుంచి గట్టెక్కిస్తూ కనకదుర్గమ్మ వారధినుంచి కోటినగర్ వరకు రూ. 122కోట్లతో రక్షణగోడ నిర్మించారు. తాజాగా పద్మావతి ఘాట్ నుంచి కనకదుర్గమ్మవారధి వరకు రూ. 120.82 కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి.

కృష్ణలంకకు రక్షణ కవచం

విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని కృష్ణలంక ప్రాంతం కృష్ణానదికి వరదలు వచ్చినపుడల్లా ముంపుబారిన పడేది. ఇక్కడి కాలనీ వాసులందరినీ ఇతర ప్రాంతాలకు తరలించేవారు. వారం, పదిరోజుల పాటు వారంతా ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిబిరాల్లోనే తలదాచుకునేవారు. ఈ సమస్యను ప్రత్యక్షంగా చూసిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రక్షణ గోడ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కనకదుర్గమ్మ వారధి నుంచి కోటి నగర్ వరకు 1.2 కిలో మీటర్ల పొడవునా రూ.122.90 కోట్లతో పనులు పూర్తయ్యాయి. ప్రకాశం బ్యారేజీ దిగువన దాదాపు 50,000 మంది ప్రజలు నివసిస్తున్నారు. బ్యారేజీ నుంచి మిగులు జలాలు విడుదల చేసిన ప్రతిసారీ చలసాని నగర్, కృష్ణలంక, గీతానగర్, రాణిగారితోట, బాలాజీ నగర్, ద్వారకా నగర్, భ్రమరాంబపురం వంటి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యేవి. రక్షణ గోడ నిర్మాణంతో ఈ ప్రాంత వాసుల కష్టాలు పూర్తిగా తీరాయి.

బీసీల బతుకులు మారాయి

వైఎస్సార్‌సీపీ వల్లే బడుగులకు సమున్నత స్థానం

- చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో బీసీలకు ఒరిగిందేమీ లేదు
- ప్రతిపక్షాలవన్నీ మోసపు మాటలే... వాటిని ఎవరూ నమ్మొద్దు
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య స్పష్టీకరణ
- విజయవంతమైన 139 బీసీ కులాల ఆత్మీయ సమావేశం



బీసీ కులాల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య

సాక్షి, అమరావతి: సమాజంలో అన్ని విధాలుగా వెనుకబడిన తరగతుల వారికి ఈ ప్రభుత్వంలోనే సరైన న్యాయం జరిగిందని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. డబ్బు, నోరు, శక్తి, గుర్తింపు లేనివాళ్లకు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో అగ్రపీఠం వేసిన ఏకైక వ్యక్తి ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. జగన్ పాలనలో బడుగుల బతుకులు మారాయని, ఆయన గెలుపుతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని ఉద్ఘాటించారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం ఆధ్వర్యంలో విజయవాడలోని ఓ హోటల్‌లో 139 బీసీ కులాల ప్రతినిధులతో గురువారం బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.మారేష్ అధ్యక్షతన నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ తన 45 ఏళ్ల బీసీ ఉద్యమ ప్రస్థానంలో ఎంతో మంది నాయకులను చూశాననీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదల మేలు కోరే జగన్ వంటి నాయకుడిని చూడలేదనీ పేర్కొన్నారు. ఆయన ఒక రాజకీయ నాయకుడిగా కాకుండా సంఘ సంస్కర్తగా అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని, సామాజిక న్యాయం అందించడంలో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. నాలుగున్నరేళ్ల ఆయన పాలనలోనే వాస్తవ రాజ్యాధికార బదిలీ జరిగిందని స్పష్టం చేశారు. ఏ రాష్ట్రంలోనూ జరగనంత సామాజిక న్యాయం ఆంధ్రప్రదేశ్‌లో జరిగిందని చెప్పారు. సామాజిక న్యాయం కోసం, సమ సమాజం నెలకొల్పే దిశగా జగన్ పాలన కొనసాగుతున్నందున బీసీలంతా ఆయనకు మద్దతుగా నిలవాలని కృష్ణయ్య పిలుపునిచ్చారు.

బీసీలు బాగుంటే చంద్రబాబుకు కడుపుమంట

సీఎం జగన్ పాలనలో రాష్ట్రంలోని పేదవర్గాల కడుపునిండుతుంటే చంద్రబాబు వంటి పెత్తందార్ల కడుపు మండుతోందని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా 'ఖబడ్దార్ ప్రతిపక్షాలు.. మీ మోసాలు మాకు తెలిశాయి' అంటూ కృష్ణయ్య హెచ్చరించారు. అమ్మఒడి, విద్యాదీవెన వంటి అనేక పథకాలు పెట్టి బీసీల బిడ్డలను సీఎం జగన్ చదివిస్తున్నారనీ, విదేశీ విద్య వంటి ప్రోత్సాహంతో బీసీల పిల్లలు అమెరికాలో చదువుకుంటున్నారనీ, వారి ఆర్థిక పరిస్థితులు మెరుగుపడి బీసీలు ఇప్పుడు కార్లు, విమానాల్లో తిరుగుతున్నారని చెప్పారు. పొరుగున ఉన్న ఒడిశా, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాలకు వెళ్లి బీసీ బతుకులు ఎలా ఉన్నాయో చూస్తే ఏపీలో బీసీల అభివృద్ధి ఎంత గొప్పగా ఉందో తెలుస్తుందని చెప్పారు. ఇటీవల కర్ణాటకలోని బళ్లారి, తమిళనాడులోని తెలుగు వారుండే ప్రాంతంలో ఓ సమావేశానికి తాను వెళ్లినపుడు అమ్మ ఒడి, పింఛన్, విద్యా కానుక, ఆరోగ్యశ్రీ వంటి పథకాల కోసం తమను కూడా ఏపీలో కలిపితే బాగున్ను అని అక్కడివారు తనతో అన్నట్టు ఉదహరించారు. రాష్ట్రాన్ని 14 ఏళ్ళు పాలించిన చంద్రబాబు బీసీలకు చేసిందేమీ లేదని మండిపడ్డారు. ప్రతిపక్షాల మోసపు మాటలు ఎవరూ నమ్మొద్దని పిలుపునిచ్చారు.

ఎమ్మెల్సీలు చెరొకటి

▶ మొదటి పేజీ తరువాయి

వారి పదవీకాలం 2027 నవంబర్ 30 వరకు ఉంది. అయితే వారి రాజీనామా అనివార్యం కావడంతో మండలిలో రెండు స్థానాలు ఖాళీ అయ్యాయి.

కాంగ్రెస్ టికెట్ మైనారిటీ వర్గానికేనా?

ఈ రెండు స్థానాల కోసం అధికార, ప్రతిపక్ష పార్టీల నుంచి చాలామంది నేతలు పోటీ పడుతున్నారు. ఎన్నికల సమయంలో ఆయా పార్టీల అగ్ర నాయకులు పలువురికి ఎమ్మెల్సీ హామీలిచ్చారు. ఇప్పుడు అదే వారికి తలనొప్పిగా మారనుంది. కాంగ్రెస్ పార్టీలో ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉంది. అయితే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ఒక్క మైనారిటీ కూడా ఎమ్మెల్యేగా ఎన్నిక కాకపోవడంతో ఆ వర్గానికి టికెట్ ఇచ్చే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. సామాజిక సమతుల్యతను దృష్టిలో పెట్టుకుని అధిష్టానం కూడా మైనారిటీల వైపు మొగ్గు చూపే అవకాశం ఉందని అంటున్నారు. అయితే రాష్ట్రంలో పార్టీ ఎలాగైనా గెలవాలన్న ఉద్దేశంతో తమ అసెంబ్లీ స్థానాలను త్యాగం చేసిన పలువురు నేతలు కూడా ఎమ్మెల్సీ స్థానాన్ని ఆశిస్తున్నారు. కాగా ప్రస్తుతం ఢిల్లీలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దీనిపై అధిష్టానంతో చర్చించే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్సీ స్థానం ఆశిస్తున్న వారిలో ఇటీవల ఎన్నికల్లో ఓటమి చెందిన షబ్బీర్ అలీ, ఫిరోజ్‌ఖాన్, అజారుద్దీన్, అలీ మస్కతి, అద్దంకి దయాకర్, అందెశ్రీ, సంపత్, మధుయాష్కీ గౌడ్‌లు ఉన్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మరోవైపు ఎన్నికల పొత్తులో భాగంగా సీపీఐకి రెండు ఎమ్మెల్సీ స్థానాలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అయితే ఇప్పుడు ఒకే స్థానం లభించే అవకాశమున్నందున సీపీఐకి కేటాయించే అవకాశాలు తక్కువేనని అంటున్నారు.

ఎవరి త్యాగానికి ఫలితం దక్కుతుందో?

బీఆర్ఎస్ విషయానికొస్తే..అసెంబ్లీ ఎన్నికల సమయంలో పోటీ నుంచి తప్పించిన పలువురు నేతలకు ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పిస్తామని అధినేత కేసీఆర్ స్వయంగా హామీ ఇచ్చారు. స్టేషన్‌ఘనపూర్ స్థానాన్ని కడియం శ్రీహరి కోసం త్యాగం చేసిన మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, జనగాం స్థానాన్ని పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోసం వదులుకున్న ముత్తిరెడ్డి యాదగిరి, నర్సాపూర్ స్థానాన్ని సునీతా లక్ష్మారెడ్డి కోసం త్యాగం చేసిన మదన్‌రెడ్డి, కామారెడ్డిలో పార్టీ అధినేత కేసీఆర్ కోసం త్యాగం చేసిన గంపా గోవర్ధన్ ఎమ్మెల్సీ స్థానం ఆశిస్తున్నట్లు పార్టీలో ప్రచారం జరుగుతోంది. అయితే అధినేత ఎవరివైపు మొగ్గు చూపుతారనేది ఆసక్తికరంగా మారింది. 119 మంది సభ్యులున్న రాష్ట్ర శాసనసభలో కాంగ్రెస్ 65 (సీపీఐ 1 కలిపి), బీఆర్ఎస్ 39, బీజేపీ 8, ఎంఐఎం ఏడుగురు ఎమ్మెల్యేల బలం కలిగి ఉన్నాయి.

రెండు ఎమ్మెల్సీ స్థానాలకు 29న పోలింగ్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికల నగారా మోగింది. కడియం శ్రీహరి, పాడి కౌశిక్‌రెడ్డిల రాజీనామాతో శాసనమండలిలో ఎమ్మెల్యేల కోటాలో ఖాళీ అయిన రెండు స్థానాలకు ఎన్నికలు నిర్వహించడానికి కేంద్ర ఎన్నికల సంఘం గురువారం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 11వ తేదీన నోటిఫికేషన్ జారీ చేయనుంది. 18న నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ కాగా, 19న నామినేషన్లను పరిశీలిస్తారు. 22న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. 29వ తేదీన ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్లు లెక్కిస్తారు. ఫిబ్రవరి 1వ తేదీలోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి అవుతుందని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది.

సిరిసిల్ల నేతన్నలకు రూ.130 కోట్ల ఆర్వీఎం ఆర్డర్లు



సిరిసిల్లలోని పవర్‌లూమ్స్‌లో వస్త్రోత్పత్తి

▶ మొదటి పేజీ తరువాయి

గురువారం 'సాక్షి'కి తెలిపారు. 1.30 కోట్ల మీటర్ల వస్త్రోత్పత్తి ఆర్డర్లను సిరిసిల్ల నేతన్నలకు అందిస్తున్నామని వివరించారు. టెక్స్‌టైల్ పార్క్‌లోని ఆధునిక మగ్గాలపై షర్టింగ్ వస్త్రం, సిరిసిల్లలోని పవర్ లూమ్స్‌పై సూటింగ్, ఓనీ వస్త్రాన్ని ఉత్పత్తి చేసే ఆర్డర్లు ఇవ్వనున్నామని చెప్పారు. ఆర్వీఎం ఆర్డర్ల విలువ రూ.130 కోట్లు ఉంటుందని అంచనా.

50 శాతం కాటన్‌తో వస్త్రాల ఉత్పత్తి

గతానికి భిన్నంగా 50 శాతం కాటన్ నూలుతో కలిపి ఆర్వీఎం వస్త్రాలను ఉత్పత్తి చేయనున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లలో చదివే విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్ కోసం ఈ వస్త్రోత్పత్తి ఆర్డర్లను సిరిసిల్ల నేతన్నలకు అందిస్తున్నారు. వస్త్రోత్పత్తికి ముందే నూలును వార్పిన్ చేసి, సైజింగ్ చేసిన తరువాత మగ్గాలపై వస్త్రాన్ని ఉత్పత్తి చేయనున్నారు. సిరిసిల్లలో తొలిసారి ఈ ప్రయోగం చేస్తున్నారు. గతంలో ప్లెయిన్ వస్త్రాన్ని ఉత్పత్తి చేసి ప్రింటింగ్ చేయించేవారు. కానీ ఈసారి వీవింగ్‌లోనే డిజైన్లు వచ్చేలా ఉత్పత్తి చేస్తున్నారు.

'మేడిగడ్డ' కుంగుబాటుపై అధ్యయనం

సాక్షి, హైదరాబాద్: మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు దారితీసిన కారణాలను కనిపెట్టడానికి నీటిపారుదల శాఖ గురువారం ఎలక్ట్రికల్ రెసిస్టివిటీ టెస్ట్ (ఈఆర్‌టీ) చేపట్టింది. వారంలోగా బ్యారేజీ కుంగుబాటు కారణాలు తెలుస్తాయని అధికారులు భావిస్తున్నారు. ఎక్స్‌రేలో ఎలా ఫలితం కనిపిస్తుందో ఈఆర్‌టీలోనూ అలాంటి ఫలితం కనిపిస్తుందని చెబుతున్నారు. గతేడాది అక్టోబర్ 21న మేడిగడ్డ బ్యారేజీలోని 7వ బ్లాక్ పియర్లు కుంగుబాటుకు గురవగా దీన్ని గత నెల 29న మంత్రుల బృందం పరిశీలించింది. ప్రస్తుతం చేస్తున్న పరీక్షలు కొనసాగుతాయని, బ్యారేజీకి సంబంధించి మరెక్కడైనా ఇలాంటివి ఏర్పడ్డాయా అనే అంశాన్ని పరిశీలించనున్నారు. అధికారుల నివేదిక ప్రకారం 16 నుంచి 21 వరకు ఉన్న పియర్లు ప్రభావితం అయినట్లు చెబుతున్నారు. ఈ బ్యారేజీని నిర్మించిన ఎల్‌అండ్‌టీనే ఈ పరీక్షలు నిర్వహిస్తోంది. ఇక సుందిళ్ల బ్యారేజీలో సీపేజీ బయటపడటంతో ఆ రెండు చోట్ల కూడా గ్రౌటింగ్ చేశారు. అన్నారంలో నాలుగు చోట్ల సీపేజీ బుంగలు ఏర్పడగా నాలుగు చోట్ల గ్రౌటింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. గ్రౌటింగ్ తరువాత ఈ రెండు బ్యారేజీల వద్ద కూడా ఈఆర్‌టీ పరీక్షలు నిర్వహించనున్నట్లు సమాచారం.

కానిస్టేబుల్ నియామకాలకు లైన్‌క్లియర్

▶ మొదటి పేజీ తరువాయి

అప్పీలు చేసింది. సింగిల్ జడ్జి అన్ని అంశాలను పరిశీలించలేదని, ఆ తీర్పును కొట్టివేయాలని కోరింది.

ఆ పని నిపుణుల కమిటీలే చేయాలి

రాష్ట్ర ప్రభుత్వ అప్పీల్‌పై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావుల ధర్మాసనం విచారణ జరిపి తాజాగా తీర్పు వెలువరించింది. సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును పక్కనపెడుతున్నట్లు పేర్కొంది. రిక్రూట్‌మెంట్ బోర్డులు నిర్వహించే నియామక పరీక్షల్లో తలెత్తే సమస్యల్లో న్యాయస్థానాలు జోక్యం చేసుకుని ప్రశ్నలు తొలగించడం సరికాదని స్పష్టం చేసింది. ఇలాంటి పనులను నిపుణుల కమిటీలే చేయాలంటూ సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా ప్రస్తావించింది. ప్రశ్నల తప్పిదాలపై ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో స్వతంత్ర కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించింది. అభ్యర్థులలో విశ్వాసం పెంపొందించేలా పారదర్శకంగా రెండు కమిటీలను ఏర్పాటు చేయాలని.. ఆ కమిటీలు ఇచ్చే నివేదిక ఆధారంగా చర్యలు చేపట్టాలని నియామక బోర్డును ఆదేశించింది. ఒక కమిటీలో ఉన్న సభ్యులు మరో కమిటీలో ఉండకూడదని స్పష్టం చేసింది. నాలుగు వారాల్లోగా నియామక ప్రక్రియను పూర్తిచేయాలని పేర్కొంది.

ఎంపికైన అభ్యర్థులకు ఊరట

రిక్రూట్‌మెంట్ బోర్డు కానిస్టేబుల్ పరీక్షలకు సంబంధించి గత ఏడాది అక్టోబర్ 4వ తేదీనే ఫలితాలు ప్రకటించింది. మొత్తం 16,604 పోస్టులకు గాను 15,750 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేస్తూ.. జాబితాను విడుదల చేసింది. ఎంపికైనవారిలో 12,866 మంది పురుషులు, 2,884 మంది మహిళలు ఉన్నారు. వారందరికీ హైకోర్టు ధర్మాసనం తీర్పుతో ఊరట లభించింది.

జిల్లా వార్తలు

ముగిసిన ఇగ్నైట్ ఫెస్ట్



యూత్ పార్లమెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు

దమ్మపేట: దమ్మపేట మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో నిర్వహిస్తున్న రీజినల్ స్థాయి ఇగ్నైట్ ఫెస్ట్ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఖమ్మం రీజినల్ కోఆర్డినేటర్ తుమికి వెంకటేశ్వరరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, ప్రతిభను వెలికితీయొచ్చని.. వారిలో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. కాగా, చివరిరోజు విద్యార్థులకు యూత్ పార్లమెంట్ పోటీలు నిర్వహించగా, రెండు రోజుల పాటు జరిగిన సైన్స్ ఫెయిర్, సాంస్కృతిక, యూత్ పార్లమెంట్ పోటీల్లో ఏడు గురుకులాల నుంచి 1,500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు దమ్మపేట ప్రిన్సిపాల్ జానునాయక్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, గురుకులాల ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్ శ్యాం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



పెద్దమ్మతల్లికి అర్చన నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పాల్వంచ మండలంలోని కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువైన శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి సువర్ణ పుష్పార్చన పూజలు జరిపించారు. 108 సువర్ణ పుష్పాలతో అర్చన, హారతి, మంత్రపుష్పం, నివేదన పూజలు చేయగా.. ఈఓ ఎన్.రజనీకుమారి, కమిటీ అధ్యక్షుడు మహిపతి రామలింగంతో పాటు చందుపట్ల శ్రీనివాస రెడ్డి, గంధం వెంగళరావు, పద్మనాభశర్మ, రవికుమార్‌శర్మ పాల్గొన్నారు. కాగా, పెద్దమ్మతల్లి ఆలయంలో ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు. ఇక ఆలయానికి వచ్చే భక్తుల కోసం ఖమ్మం జిల్లా రామకృష్ణాపురానికి చెందిన రామిశెట్టి గోపి రూ.25వేల విలువైన వాటర్ కూలర్‌ను ఆలయానికి వితరణ చేయగా, అర్చకులు ఆయనకు అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

విద్యార్థి దశ నుంచే క్రీడాస్ఫూర్తి అవసరం

- భద్రాద్రి జిల్లా కలెక్టర్ ప్రియాంక
- కిన్నెరసానిలో ప్రారంభమైన రాష్ట్రస్థాయి గిరిజన విద్యార్థుల క్రీడోత్సవాలు
- పోటీలను ప్రారంభించిన కలెక్టర్, ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్



బెలూన్లు వదిలి పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రియాంక, ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, ఎమ్మెల్యేలు ఆదినారాయణ, రాందాస్‌నాయక్ తదితరులు

పాల్వంచరూరల్: విద్యార్థులు చదువుపై దృష్టి సారిస్తూ క్రీడాస్ఫూర్తిని అలవరుచుకోవాలని.. తద్వారా విజయాలు సాధ్యమవుతాయని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ప్రియాంక అల తెలిపారు. పాల్వంచ మండలం కిన్నెరసానిలోని స్పోర్ట్స్ స్కూల్‌లో భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యాన మూడు రోజుల పాటు జరగనున్న రాష్ట్రస్థాయి గిరిజన పాఠశాలల క్రీడోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కలెక్టర్ క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించి పోటీలను ప్రారంభించారు. అలాగే, అశ్వారావుపేట, వైరా ఎమ్మెల్యేలు జారె ఆదినారాయణ, రాందాస్‌నాయక్, ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, డీడీ మణెమ్మ, రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ ఆఫీసర్ బి.జ్యోతితో తదితరులతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించి క్రీడాజ్యోతి వెలిగించారు. అలాగే, క్రీడాకారుల గౌరవ వందనాన్ని స్వీకరించిన కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువులతో పాటు క్రీడలు కూడా ముఖ్యమేనన్నారు. క్రీడల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించి క్రమశిక్షణతో ముందుకు సాగితే భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. అనంతరం పీఓ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి తోడ్పడతాయని చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణ బాధ్యత కిన్నెరసాని స్కూల్‌కు దక్కడం సంతోషంగా ఉందన్నారు. క్రీడల్లో విద్యార్థులు ప్రతిభ చాటి ఐటీడీఏకు పేరు ప్రఖ్యాతులను తీసుకురావాలని కోరారు. ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ.. తాను కూడా ఆశ్రమ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేసి ఈ స్థాయికి చేరానని తెలిపారు. గిరిజన పాఠశాలల్లో వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, డిప్యూటీ డైరెక్టర్ చందన, ఏటూరునాగారం ఐటీడీఏ డీడీ పోచం, కిన్నెరసాని సర్పంచ్ బొర్రాకుమారి, ఎంపీటీసీ శోభారాణి, ఏసీఎంఓ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



గిరిజన వేషధారణలోని బాలికలతో కలెక్టర్, ఐటీడీఏ పీఓ, ఎమ్మెల్యే

తొలిరోజు విజేతలు వీరే..

రాష్ట్రస్థాయి గిరిజన పాఠశాలల క్రీడోత్సవాలకు నాలుగు ఐటీడీఏల నుంచి 1,650 మంది విద్యార్థులు, 400 మంది పీఈటీలు, పీడీలు, కోచ్‌లు హాజరయ్యారు. ఈమేరకు తొలిరోజు పోటీల్లో విజేతల వివరాలిలా ఉన్నాయి. బాలుర ఖోఖో పోటీల్లో ప్లేన్ ఏరియా–2 జట్టుపై భద్రాచలం మొదటి జట్టు, ప్లేన్ ఏరియా–1పై ఉట్నూరు–2 జట్టు, ఉట్నూర్–1పై ఉట్నూర్–2 జట్టు విజయం సాధించారు. అలాగే, కబడ్డీలో ప్లేన్ ఏరియా–2 జట్టుపై భద్రాచలం, ప్లేన్ ఏరియా–1పై ఏటూరునాగారం జట్లు గెలిచాయి. ఇక 800 మీటర్ల పరుగు పందెం బాలుర విభాగంలో కె.రంగారావు, జె.ప్రవీణ్, ఎస్.రవీందర్, బాలికల విభాగంలో వి.నిఖిత, శ్రీలత, యు.మోతే బాయి, షాట్‌పుట్‌లో కె.తేజస్విని, బి.నాగేంద్ర, ఎం.ప్రణీతి మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.



కబడ్డీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు



పరుగు పందెంలో పాల్గొన్న బాలికలు

ఆర్టీసీ ఉద్యోగుల వనభోజనాలు..

ఖమ్మం మామిళ్లగూడెం: ఉద్యోగుల మానసికోల్లాసం కోసం విడతల వారీగా వనభోజనాలకు తీసుకెళ్లాలన్న ఆర్టీసీఎండీ సజ్జనార్ ఆదేశాలతో ఖమ్మం డిపో ఉద్యోగులకు గురువారం గొల్లగూడెంలోని చెరుకూరి మామిడితోటలో వనభోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 300 మందికి పైగా ఉద్యోగులు హాజరై ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడిగా గడిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఖమ్మం రీజియన్ మేనేజర్ చెరుకూరి వెంకన్న పాల్గొని మాట్లాడుతూ.. విధినిర్వహణలో ఒత్తిడి ఎదుర్కొనే ఉద్యోగులకు మానసికోల్లాసం కలిగించాలని వనభోజనాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. డీఆర్ఎం పవిత్ర, డిప్యూటీ సీటీఎం భవానీప్రసాద్, ఖమ్మం డిపో మేనేజర్ బి.శ్రీనివాస్‌తో పాటు రామిశెట్టి రామయ్య, శ్రీనివాస్, జయరాజు, అంజయ్య, సీతారామారావు, బీఆర్.రెడ్డి, కృష్ణ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



వనభోజనాలకు హాజరైన ఉద్యోగులతో ఆర్టీసీ అధికారులు

మెరుగైన రేట్ల ఒప్పందానికి సిద్ధం కావాలి

ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ

ఇల్లెందురూరల్: పెంకు పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల వేతన ఒప్పందంపై యాజమాన్యాలు మొండివైఖరిని విడనాడి మెరుగైన రేట్ల ఒప్పందానికి సిద్ధం కావాలని ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ డిమాండ్ చేశారు. వేతన రేట్ల ఒప్పందంపై ఇల్లెందు మండలంలోని చల్లసముద్రంలో గురువారం పెంకు పరిశ్రమల యజమానులు, కార్మిక సంఘం నేతల మధ్య చర్చలు జరిగాయి. కార్మికులకు కాంట్రాక్టు రేట్లపై 15శాతం, దినకూలీ వేతనం రూ.35కు పెంచాలని కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. దీనికి యజమానులు అంగీకరించకపోవడంతో చర్చలు విఫలమైనట్లు నాయకులు ప్రకటించారు. అనంతరం ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ యజమానుల వైఖరితోనే చర్చలు విఫలమయ్యాయని, ఇకనైనా స్పందించి అంగీకారం తెలపకపోతే నిరవధిక సమ్మెకు దిగుతామని తెలిపారు. ఈ చర్చల్లో యజమాన్యాల ప్రతినిధులు మాగంటి ప్రసాద్, బండారి వెంకన్న, సాంబశివరావు, అరవింద్, విక్రమ్‌రెడ్డి, పూర్ణచంద్రారెడ్డి, నాయకులు జె.సీతారామయ్య, రాంసింగ్, మదార్, ఏపూరి వీరభద్రం, మూతి రాంబాబు, సనప రాంబాబు, శ్రీరాములు, దుర్గాప్రసాద్, లింగ్యా, లక్ష్మీనారాయణ, రవి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



చర్చల్లో పాల్గొన్న కార్మిక సంఘం నాయకులు

అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణపై దృష్టి



అగ్నిప్రమాదాల నివారణ చర్యలను వివరిస్తున్న అధికారులు

మణుగూరు రూరల్: అడవుల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మణుగూరు అటవీశాఖ ఆధ్వర్యాన గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అడవుల్లో సంభవించే అగ్ని ప్రమాదాలు, నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై హైదరాబాద్ నుంచి వచ్చిన నిపుణులు అవగాహన కల్పించారు. ఎఫ్‌డీఓ సయ్యద్ మొహియుద్దీన్ మాట్లాడుతూ.. వేసవి సమీపిస్తున్న నేపథ్యాన అగ్నిప్రమాదాలు జరిగే అవకాశముందని తెలిపారు. ఈమేరకు పశువుల కాపర్లు, ఇతర వ్యక్తులు అగ్గిపెట్టెలు, బీడీలు, సిగరెట్లు తీసుకెళ్లకుండా తనిఖీలు ముమ్మరం చేయాలని, తునికాకు సేకరణకు వెళ్లే కూలీలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఇందుకోసం అటవీశాఖ ఉద్యోగులు అడవుల్లో పెట్రోలింగ్ నిర్వహించాలని తెలిపారు. ఎఫ్ఆర్ఓలు జి.ద్వాలియా, రమేశ్, తేజస్వి పాల్గొన్నారు.

కేంద్ర బొగ్గుశాఖ కార్యదర్శిని కలిసిన సీఎండీ

ప్రగతి నివేదికను అందజేసిన బలరామ్

సింగరేణి(కొత్తగూడెం): కేంద్ర గనులశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ గురువారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా సింగరేణి ప్రగతి నివేదిక, భవిష్యత్ ప్రణాళికను అందజేసి మాట్లాడారు. భూగర్భగనులు, ఓపెన్‌కాస్ట్‌లకు కొన్నాళ్లుగా అనుమతులు రావడం లేదని వివరించి దృష్టి సారించాలని కోరారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి..

సింగరేణిలో ఖాళీ పోస్టుల భర్తీకి త్వరలోనే నోటిఫికేషన్ ఇవ్వనున్నామని సీఎండీ ఎన్.బలరామ్ వెల్లడించారు. సంస్థను అగ్రగామిగా నిలిపేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఉన్న ఉద్యోగులపై భారం తగ్గేలా ఖాళీ పోస్టులు భర్తీ చేస్తామని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే, పేర్ల సమస్యతో పాటు ఆస్పత్రులు, విద్యాసంస్థల నిర్వహణ, సోలార్, థర్మల్ విద్యుత్‌పై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు వెల్లడించారు.



కేంద్ర గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో సీఎండీ బలరామ్